# అబద్ధం లో నిజం

ఆమె కొళాయికి వెళ్లినప్పుడల్లా, వచ్చినప్పుడల్లా వాడు "అమ్మగారూ ! నమస్కారం!" అనడం ఆమెకి దిగ్భ్రాంతి కలిగించింది మొదట్లో. ప్రక్క మరెవరికో పెడుతున్నాడు కామోలు అనుకుందిగాని రోజూ యిదే అలవాటు కావటంచేత అనుమానించింది. అయినా తను చూస్తే యిరవై ఏళ్ళు నిండనిది. అతడు చూస్తే 40 ఏళ్ళ మనిషి.

ఎందుకు చెప్మా యిలాగంటాడని అతనివైపు చూడాలని అనిపించక పోయినా యథాలాపంగా అనుకోకుండా చూసేసరికి వాడు పిశాచికి రంగు రాసుకున్నట్టు, మనిషి అంత మంచివాడు కానట్టు అనిపించింది ఆవిడకి. మాటాడకుండా తన దారిని తను పోతూంది, అటువైపు చూడకుండా.

ఆ కొళాయికి అదొక్కటేదారి మరి! ఇప్పుడు! ఎలా ? ఎవరి వాలనయినా పోయించుకుందికి ముసలి అత్తగారికి 'మడి' చెల్లదు. ఏం చెయ్యాలి ? అయినా ఇంతలో ఏం పోయింది ? వాడి ఉద్దేశ్యం ఏమయి వుంటుందీ...

అమ్మగారూ అంటున్నాడే ! వాడు అనడంలో సదుద్దేశ్యం ఉన్నట్టు లేదు... అనుకోనీ - తనకేం తన మానాన్ని తను తనను కాపాడుకొని పోతేసరి, నాలుగుసార్లు అనుకొని వాడే వూరుకుంటాడు అనుకుందామె.

ఇలా రోజులు గడుస్తున్నాయి. ఆ పిశాచరాయుడు రాను రాను కోరచూపులు చూస్తూండడం, యీమె రాకకోసం యివతల దేవుల పడటం ఆమెకి ప్రాణసంకటంగా మారింది.

ఈ విషయం భర్తతో చెప్పాలనుకుంది... కాని - "యీ పాటిదానికే ఎందుకు ? ఏం చేస్తాడేం?... భర్తతోనే గాని తొందరపడి చెబితే. ఏమో ? ఏమనుకుంటాడో. లేక - అతడితో తగువుకి దిగితే - ఇంకేమయినా వుందీ ? ఆ కోపాలుంచుకొని, ఒకదానికొకటేం జరుగుతుందో ! వాడు చూస్తే రౌడీ వెధవలా గున్నాడు. ఎటొచ్చి, ఏంచేసినా, తన భర్తకి, తమకి - అక్కడ దిక్కు ఎవ్వరు ?

ఒకనాడు -

ఆమె, ప్రక్క యింటివాళ్ళు కలిసి, ఎవరింటికో పేరంటానికి పోతుండగా, వాడు

"రండి... రండి... యిలా కూర్చోండి... అలా వెళ్ళిపోతారేం... లోపలికి రండి!..." అని వెధవనవ్వు - పోకిరీ నవ్వు - నవ్వుతూ ఆహ్వానించడం చూసి, వీళ్ళకి ముచ్చెమటలూ పోసేశాయి. కాళ్ళాడలేదు. కళ్ళు పచ్చబడి వెనక్కి తిరక్కుండా బిక్కమొహాలతో, యిళ్ళకొచ్చి పడ్డారు. ఇళ్ళలో క్షేమంగా చేరాక గుండెలు పట్టుకొని, ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకొని "బ్రతికాం" అనుకొన్నారు. -

వాడి దృష్టిలో పడింది. తనొక్కర్తే కాక మిగతా వారు కూడా వున్నారని కాస్త ధైర్యం పడ్డారు ఒక్కొక్కరూ తమలో. కాని యిది ఎంతవరకు వెళుతుందో అని బెంగపడుతూనే వున్నారు....

'ఆమెకు' మాత్రం ఆ దినం నిద్రపట్టలేదు. తిండి సహించలేదు ; మనసులో యుద్ధం ప్రారంభం అయింది : హృదయం బరువెక్కిపోయి, భర్తతో చెప్పే ధైర్యం చాలక అత్తగారితో చెప్పేసింది. అత్తగారు ఆలోచించి, కొడుకుతో యింత చిన్న విషయం చెప్పనవసరం లేదని సలహా యిచ్చింది. అక్కడనుండి కోడలిని కొళాయి దగ్గరికి పంపడం మాని, అతి కష్టం మీద తనే వెళుతూ వస్తుండేది. కాని ఎన్నాళ్ళు అలా తేగలదు ? శక్తి లేదు. అంచేత మళ్ళీ ఆమె - వెళ్ళక తప్పలేదు.

కొన్నాళ్ళు ఆమె అటు వెళ్ళకపోయేసరికి వాడు నిరాశచెంది, ఊరుకున్నాడు. కాని అకస్మాత్తుగా తిరిగి యీమె దర్శనం అయేసరికి, వెకిలి చేష్టలు ప్రారంభించేడు... మళ్ళీ ఆమెలో దిగులు, బెంగ, ఎక్కువైనాయి. తిరిగి మొగుడితో చెప్పడమా, వద్దా అని తర్కం ప్రవేశించింది. చెబితే, పర్యవసానం ఏమిటని ఒక బెంగ. చెప్పక వూరుకుంటే ఏది ఎలా వచ్చినా, తెలిసేక యింతవరకు ఎందుకు చెప్పలేదు? అని అంటారేమో....

మరోనాటి సంఘటన -

ఆమె కొళాయినుండి నీళ్ళు తెస్తూంది. చంకలో బిందె పెట్టుకొని వస్తున్న ఆమెను సూర్యుని లేత ఎండ వెలుగుల్లో, చూస్తోంటే ఏ అజంతా కన్యో నడిచి వస్తున్నట్టుంది. వస్తూ వస్తూ, యీ హోట్లు దగ్గరికి రాగానే, మన మీసాలరాయుడు అతి వినయంగా వచ్చి-

'' ఆ బిందెనీళ్ళు కాస్త దింపుకొని మరీ వెళ్ళరాదూ ? మరీ అలసినట్టున్నావు, దింపనా ?'' అని అన్నాడు.

అంత అమర్యాదగా అంటున్న వాడిని చూడగానే ఆమెకి అసహ్యం వేసింది. ఇంక సహించలేకపోయింది. బాగా బుద్ధి చెప్పదలచుకొని, ఒక్కసారిగా వెనక్కి తిరిగి, వాడిని ఉద్దేశించి ''ఛీ పో- నాతో మాటలేమిటి నీకు ? ఎందుకలా పలకరిస్తావు ! బుద్ధి లేదూ! ఈసారి నా జోలెత్తావా మర్యాద దక్కదు '' అని అనేసి, గబగబా వెళ్ళిపోతూ, దూరంగా వస్తున్న తన భర్తని చూసి గతుక్కుమంది. తన భర్త చూశాడా ? చూసేవుంటాడు. ఏమనుకున్నాడో ? రోజూ సుఖం పంచుకు పోతున్నది. ఈనాడే ఎందుకు వాడికి జవాబు చెప్పాలి ! ఆ ఛెప్పడం తన భర్త దూరం నుంచి చూసి ఏం మాట్లాడేనని అనుకున్నాడో? అనుమానిస్తాడో ఏమో ? ఏమిటీ ఖర్మ!''

అని ఆ బెంగలో గాభరాలో, బిందె క్రింద పడిపోగా వళ్ళంతా బురద (తుళ్ళి) పాడయింది ; అక్కడ నుండి చైతన్యం లేకుండా బిందె పట్టుకు, గబగబా యింటికి వచ్చేసి, మంచం మీద పడి ఏడ్వడం మొదలెట్టింది; మామూలుగా అయితే ఏమోగాని ఆమె ఆరుమాసాల కడుపుతో వుంది...

భర్త వస్తే జరిగిందంతా యింక దాచకుండా చెప్పేసి క్షమించమందామని అనుకుంది; కానీ భర్త అంత వేగిరం రాలేదు. ఆమెకి మరింత భయమైంది.

చాలా సేపయినాక భర్తవచ్చేడు గానీ, మామూలుగానే వున్నాడు, ఆమె నేమీ అనలేదు, అనుమానించినట్టయినా లేదు ; అతని వైఖరి చూసేక ఆమెకి కొంచెం ధైర్యం కలిగింది. బహుశా

ఆయన చూడలేదేమో అని అనుకుంది.

అయినా, అనవసరంగా, నిర్మలమయిన మనసునెందుకు పాడు చేయడం ? అంతా తన భయమే గాని ఏం జరిగింది గనక అంత చెప్పేపాటి! అని తిరిగి ఆ వూసు ఎత్తకుండా గుట్టుగా వూరుకుంది.

ఇలాటి పొరపాట్లే ఆడవాళ్లు చేస్తూంటారు అమాయకంగా -

ఆమె గ్రహపాటో ఏమిటో గాని - ఆ మీసాల రాయుడు యీమెనిలా పలకరించడం... కొందరి 'నారదుల' కంట పడనే పడింది; గుసగుస లెక్కువయి, చిలవలైపలవలైలన్నీ కలిసి మరోలా తయారయి చాటుగా అనుకొనే వాళ్ళు విసీ వినబడనట్టు అనడం; తర్వాత బహిరంగంగా చెప్పుకోడం, మొదలైంది.

ఆశ్చర్యం ఏమిటంటే పూర్వం తనతో సహా పరాభవింపబడ్డ యిరుగుపొరుగు ఆడవాళ్ళే, తెలిసివుండీ, బుగ్గలు నొక్కు పెట్టుగుంటున్నా రంటే - యింకేముంది ?

ఇది యిలా వుండగా, ఆమెకి, భర్త ప్రవర్తన వింతగా తోచింది. ఇంత గగ్గోలు ఎత్తిపోతున్నా ఆయనకు తెలియకుండా వుంటుందా ? మరి తెలిస్తే ఏమీ వులకడు - పలకడు, యింట్లో ఏమీ ఎవరినీ అనడు. కనీసం, అడగనయినా అడగడు; అనుమానించి నట్టయినా అగుపడడు. ఏమిటా మనస్తత్వం ? ఏమని అనుకోడం ?..

కాని.. అంత నిశ్చలంగా, ఆమె మాత్రం వుండలేకపోయింది. రానురానూ క్షీణించి పోతూంది; ఉత్సాహం చచ్చింది. మంచం ఎక్కడమే తరవాయి. యింతకన్నా చస్తే నయం- అని తలపోస్తూంది.

కాని ఎందుకు చావాలి ? తాను చేసిన పాపం ఏమిటి ?..చస్తే తనమీదనున్న యీ ఘోరాపవాదం, అలాగే వుండిపోదా !... ఏం జరిగినాసరే... యిది అన్యాయమని - తను అమాయకురాలని, అందరికీ నిరూపించాలి... ఎలా ? దానికి దైవమే సహాయపడాలి!

ఒకనాడు తలవని తలంపుగా - తమ యింటికి ఆ మీసాలరాయుడి పెళ్ళాం వచ్చేసరికి, ఆమెకి ఆశ్చర్యం, మహా కోపం కలిగింది. ఒళ్ళు మండుతున్నా మర్యాదగానే ఆహ్వానించింది. కాని .. ఆవిడ వచ్చీరావడంతోనే, జువ్వలా లేచింది. వూరంత నోరు పెట్టి - అభినయం చేస్తూ ...

''ఇదేమున్నా.. బావుందా ? మేం ఎవరమనుకున్నారు, మీ యింట్లో ఆడపిల్లల్లేరా? మీ ఆయనకి అప్పచెల్లెళ్ళు లేరా ? ఆయన కొచ్చిన ఏళ్లు ఎవళ్ళకొచ్చేయి, ఏమో మర్యాదగల వాళ్ళమనుకున్నాం, మా వంశం మర్యాదా ఏమనుకున్నారు ''... అని గట్టిగా అరుస్తూంది.

యీామె, యీామె అత్తగారూ ఏమిటో యీ ప్రళయం అర్థంగాక...

''ఏంవమ్మా ఏమిటయిందీ ?'' అని అడిగారు.

''యింకా ఏమయింది అని అడుగుతున్నారా ? తెలియనట్టు మీ యింటి వాళ్లని కొంచెం అదుపులో పెట్టండి! '' అంది.

''ఇంతకీ ఏమయింది ?''

'' ఏమనడం ? మా పిల్ల వేపే చూస్తాడు ? ఏమనుకున్నాడో ? ఆడపిల్లలుండరా? యీసారి జరిగిందంటే - మొగాళ్ళవరకూ వెడుతుంది'' అని అంది.

ఇదివిని, యిద్దరూ ఏం తోచక, నమ్మలేక, ఆశ్చర్యపోయినారు... 'ఆమె భర్త' అలాటి మనిషి

కాడు... అయినా ఏమో, అని అనుకున్నారు - కాని ఆమె అత్తగారు, అందుకొని -

''అమ్మా! ఆ ముక్కే మేమూ నిన్ను అడగొచ్చా!'' అని అంది.

''ఏమిటేమిటీ? తిరిగి అటుంచి యిటా? ఏమిటా అడిగేది?''

''మా కోడలు కొళాయికి వెళ్ళి వచ్చేటప్పుడు - ఎందుకలా మీ ఆయన గింజుకుంటాడు? దానివల్ల మేం యిప్పుడు మొహం ఎత్తుకు తిరగలేక పోతున్నామే?''

''ఏదో కారణం మామీద పెట్టి తప్పుకుందామనా? ఆయన అలాంటివారు కాదు. అయినా మీ కోడలికి - బుద్ధి వుండాలిగాని... మగాళ్ళకేం...''

''అలాగే మీ పిల్లకి బుద్ధి వుండాలి గాని, మావాడికేం?... యింత తెగించి, మంచీ, చెడ్డా ఆలోచించకుండా, ఏ మొహం పెట్టుకడగడానికి వచ్చేవు? ఎన్నిసార్లు ముఖంముందు చీవాట్లు పెట్టినా కుక్కలా అదే వరసా? మేం మొగాళ్లతో చెప్పలేకే వూరుకున్నమా వెళ్ళు వెళ్ళు చాలు చాలు!'' అని ఆమె అత్తగారనగానే -

అంత జోరుగా వచ్చిన మనిషి చల్లబడి పోయి నెత్తిమీద చేతులుంచుకొని, కూలబడి పోయి, విచిత్రంగా -

''ఏం చేయనమ్మా! నా ఖర్మ... పెళ్ళీడు గల - కూతుళ్ళూ, చెట్టంత కొడుకులూ వున్నారా! ఈడు చెల్లుతూందా? అయినా ఆయనకా చెడుబుద్ధి వదల్లేదు. కంటపడిన ఆడవాళ్ళనందర్ని - అదేవరస- ఎన్నోసార్లు చీవాట్లూ, చెప్పుదెబ్బలూ, తినడం జరిగింది.... అయినా, అంతే - ఏం చేయడం? ఎవరితో చెప్పుకోడం? కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది.

''యింకేం చెప్పేదమ్మా! ... మా పెద్దపిల్లకి ... అయిదో నెల ఉవ్వ! .... చెప్పుకుంటే సిగ్గు సిగ్గు.. యింక పెళ్ళి జరగాలా?''

''అయితే యిది మావాడి మీద తోస్తున్నారా! మీకు సిగ్గులేవూ.''

''అతడే రోజూ చుట్టూ తిరుగుతున్నాడు. దాన్ని అడిగితే బెల్లం కొట్టిన రాయిలా వూరుకుంటుంది...''

''యింక చాలుగాని... నిజం తెలుసుకోకుండా మావాడి మీద యీ పాపం పెట్టకండి. ... యింక మీరు వెళ్ళండి...'' అని పంపించేసేరు...

'ఆమె' అత్తగార్ని పట్టుకు ఏడ్వడం మొదలెట్టింది. అత్తగారూరుకోబెడుతూ 'వాడలాంటి వాడు కాదే! నీకు తెలీదూ!' మన రోజులిలా వున్నాయి. నీకొచ్చిన గతే వాడికీ వచ్చింది. నిజం ... తెలీకపోదు.. వూరుకో!'' అని ఓదార్చింది.

ఆమె, ఏడుపుని పెదిమలలోనే అణుచుగుంటూ, బాధపడుతూంది. ఏ నిశ్చయానికీ రాలేక పోతూంది, ''నిజంగా తన భర్త అలాటివాడా?''

యిందులో నిజం ఎంత అని ఆమె వాపోతూంది.

ఇలాంటి సమయంలోనే భర్త వచ్చేడు; నోటివరకూ వచ్చికూడ ఆమెగాని, అతని తల్లిగాని, ఆ విషయం తెగించి, అతనిముందు ఎత్తలేక పోయినారు...

ఇంట్లో అందరూ, ఏ నంగా ముభావంగా, నిర్జీవంగా మెసులుతున్నారు,

తన హృదయంలో నది భర్తకి చెప్పేసి, అన్ని విషయాలూ కడిగివేసి తన హృదయ భారాన్ని దింపేసుకోవాలని అనుకుంది : కాని చెప్పలేకపోయింది.

ఇద్దరూ ఎడం, ఎడంగా గడిపేసేరు -, ఆ మర్నాడు నుండి 'ఆమె మీద' దుమారం కొంచెం తగ్గి ఆమెభర్త మీద, ధాటి ఎక్కువయింది. మీసాలవాడి కూతురు పేరు యీతని పేరు, గోడలెక్కాయి. అయినాసరే, ''ఆమె భర్త'' చలించలేదు. అతని ప్రవర్తన, ధైర్యం, మొండితనం, నిర్ధ్వారంగా కనిపించింది. ప్రజల్లో గుసగుసలూ ఎక్కువవుతున్నాయి.

ఒకానొకనాడు, 'ఆమె' యింటిముందు జనం మూగేరు. అందులో ముఖ్య పాత్రధారుడా మీసాలాయనే. ఆయన తల్లిగా మారబోతున్న తన కన్య కుమార్తెని తక్కిన సంసార సైన్యాన్ని వెంటబెట్టుకుని యీ చిన్న సంసారం మీద పడ్డాడు. ఆమె బయటకి రాలేదు. ఆమె భర్త, అత్తగారు, యివతల నిల్చున్నారు.

''ఒరేయ్! పైకిరా! చీల్చేస్తా... ఏమిటో మర్యాదస్తుడివనుకున్నా. యిదా ? ఒంటరి, ఆడపిల్లని అన్యాయం చేస్తావా '' అని మీసాలు మెలివేసాడు మీసాలాయన. యింతలో మూగిన ప్రజలను ఆపి సంగతేమిటని అడిగేరు.

వాడినే చెప్పమనండి!'' అని అరిచేరు. వాళ్లు - అతడి ప్రక్క తిరిగింది జనం! ప్రశ్నార్థకంగా -

''నాకు తెలీదండి - ఇంతవరకూ ప్రక్కింటికి కామోసు జట్టీకి వచ్చేరని అనుకుంటున్నా యిప్పుడే కదా తెలిసింది నాతోనే అని -'' అన్నాడు ఆమె భర్త ధీమాగా -

''ఏమిటేమిటీ'' విన్నారా ! వీడి పొగరు ! ... యిదిగో, యిది నా కుమార్తె... యింకా పెళ్లికాలేదు... దీన్ని బుట్టలో వేసి, యీ మహానుభావుడు చెడగొట్టాడు. యింక దీనికి పెళ్ళి ఎలాగవుతుంది?.. ఏలుకుంటాడో, లేదో అని అడగడానికి వచ్చేం - '' అని సిగ్గు లేకుండా చెప్పేసరికి-

జనం అంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

''అమ్మో! తక్కువవాడుకాదురో! పెళ్ళాం, వాడితోపోతే... వీడు వాడి కూతురుకేశాడు.... ఫస్టు!'' అని అంటున్నారు ప్రజ.

ఇహ జవాబు చెప్పక తప్పదని - అతను. ''నేను నిజం చెబుతాను - మీ పిల్లకి, మోసం జరక్కుండా చూస్తాను.... కాని ఒక కండిషను మీద'' అని ఖచ్చితంగా అన్నాడు.

అప్పటికప్పుడే - ఆ వీధిలో జనంగాక - వూరిలో జనంకూడా కిక్కిరిసి వినోదం చూస్తున్నారు.

ఆ ముక్క అతడనగానే అందరూ నిశ్చయం చేశారు. ''ఒప్పేసుకోక ఏం చేస్తాడ్రా!'' అని.

అతని తల్లి, అతని భార్యా గచ్చుమన్నారు! యిదేమిట్రా భగవంతుడా ? అని.

''ఏమిటా కండిషను! మా పిల్లకి భయం లేకపోతే - ఆ కండిషనుకి ఒప్పుగుంటాను!'' అన్నాడా మీసాలరాయుడు. ''అమ్మా! భగవద్గీత - తే!'' అన్నాడు ఆమె భర్త. అతని తల్లి, నిర్ఘాంతపోయి మాటాడకుండా తెచ్చి యిచ్చింది. .. ఆమె భర్త యిలా అన్నాడు అందరి సమక్షంలోనూ -

''అయ్యా! అనగా - మా మీద దుమారాలు లేపిన, ప్రభృతులందరూ యిక్కడ వున్నారనే

అనుకుంటాను. వారందరూ మహా జాగ్రత్తగా వినండి... ఎందుకంటే మరో నిజమయిన సాక్ష్యం మీకు చెబుతున్నాను నిజం అయితే మీకక్కర్లేదు కాబోలు అయినా యిలాటి, సందర్భంకోసం, నేను కాచుగొని ఉన్నాను.

ఈ మీసాల రాయులుంగారికి, నా భార్యకీ, సంబంధం వుందని లోకంలో బజాయించడం, అందరికీ తెలిసిందే. అందులో నిజానిజాలు యీాయన యీ భగవద్గీత మీద ప్రమాణం చేసి జరిగింది జరిగినట్టు, మీ అందరిముందూ చెప్పినట్టయితే - ఆయన కూతురి లోగుట్టునే ఋజువు చేసి చెబుతాను.... మీరే నిర్ణయించండి, అని గంభీరంగా నొక్కి చెప్పేడు. అతడలా అంటూంటే ఎవ్వరూ నోరెత్తలేక పోయినారు- మీసాల రాయుడి వైపు తిరిగి ''ఏమయ్యా సిద్ధమేనా '''' అని అడిగేరు.

''ఈ భగవద్గీతే - కాదు, నా పెళ్ళాం పిల్లల మీద కూడా ప్రమాణం చేసి చెబుతున్నాను... తెలిసో తెలియకో ఆ యిల్లాలిని అనగా ఈయన భార్యని, దారిలో అడ్డుకుంటూ, పోకిరి వేషాలు వేస్తూండడం నిజమే. కాని ఆమె ఏ పాపం ఎరుగదు. నే చేసిన పాపానికి ఫలితం, నా సొంత పిల్లల్నే అనుభవిస్తున్నాను. ఆమెకీ నాకూ ఎలాటి సంబంధం లేదు. ఆ విధమైన నా ప్రవర్తనకి క్షమించమని ఆమెకి నమస్కారం చేస్తున్నాను'' అని అందరికీ వింత పుట్టేట్టుగా అన్నాడు.

ఆమె భర్త ముందుకొచ్చి, ప్రక్కింటి అమ్మలక్కల్ని ఉద్దేశించి: '' అమ్మా మీరంత వూరుకుంటారా? మీతోటి ఆడదాని పరువు నట్టేట కలుస్తూంటే'' అని అనేసరికి, ఒకరిద్దరు కలిపించుకొని -

''అవును నిజమే. ఆమె నొక్కర్తినే కాదు, ఆ దారంట వెళ్ళిన ప్రతి ఆడదాన్ని యిలాగే భయపెట్టేవాడు.''

అని సాక్ష్యం ఇచ్చేరు; మీసాలరాయుడు తల దించుకున్నాడు. ఆమె భర్త పళ్ళు నూరటం మొదలు పెట్టేడు.

''ఒకటి ఋజువు చేసేను, యింకోటి వుంది.... ఇదిగో.. ఏం అమ్మాయీ యిలా రా.... అని ఆ మీసాలరాయుని కూతుర్ని పిలిచేడు... ఆమె వొణికిపోతూ వచ్చి నిలుచుంది.

''నాతో సంబంధం వుందని మీ వాళ్ళకి నువ్వే చెప్పావా ?''

మీసాలరాయుని కూతురు జవాబుకు బదులు, ఏడ్వడం మొదలెట్టింది.

ఆమె తండ్రి, అతనూ, అందరూ బ్రతిమాలి బలవంతం చేయగా -

''లేదండీ మీరు కాదు...మీరు కాదు..'' అని యింక నిలుచోలేక, అక్కడే ఒక యింట్లోకి పారిపోయింది మొఖం చెల్లక.

''ఋజువేమిటి ?'' అనే అపనమ్మకం ప్రశ్న వచ్చింది, ప్రజలోంచి.

''వుంది... అని అంటూ ఆమె భర్తకోటు జేబులోంచి, ఒకఫోటో తీసి, అందరికీ చూపెట్టేడు. అది ఆ మీసాలాయన కూతురూ, ఆమె ప్రియుడూ కలిసి వుంటూండగా, రహస్యంగా తీసినది.

'' ఈ ఫోటో కోర్టులో ఋజువుగా పెట్టి పెళ్ళి జరిపించండి'' అని కూడా అన్నాడు. అదంతా అలా ముగియడం చూసి, అందరూ నోళ్ళు నొక్కు కున్నారు.

మీసాల రాయుడు; పరివారం అవమానం, భరించలేక సిగ్గుతో తరలి వెళ్లిపోయినారు.
తిరగబడిన ప్రజ ''కథ అడ్డం తిరిగిందే'' అని తిరిగి వెళ్ళిపోయేరు.
తెల్లగా తోమి కడిగేసిన మూకుడులో ప్రతిబింబం చూసుగొని లోకం పకపగా నవ్వుకుంది.

★ ★ ★

*(ఆంధ్ర వారపత్రిక, 13.5.1959.)*